క్లుప్తంగా

ఉయ్యూరు ట్రస్ట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



నెహ్రూనగర్: గుంటూరులో ఉయ్యూరు ట్రస్ట్ నిర్వహించిన చీరలు, కానుకల పంపిణీలో జరిగిన తొక్కిసలాటలో అసువులు బాసిన బహుజన కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ కోటి రూపాయలు అందజేయడంతో పాటు గాయపడిన వారికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు మహిళల మృతికి కారణమైన నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయమూర్తి చేత న్యాయ విచారణ చేయించి బాధ్యుల్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జూపూడి శ్రీనివాసరావు, గంటా ప్రభుదాసు, నాగేశ్వరరావు, పాగళ్ల ప్రకాష్, బత్తుల వీరస్వామి పాల్గొన్నారు.

అధ్యాపకురాలు విజయకుమారికి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల హిందీ విభాగాధిపతి కోడి విజయకుమారి 'నాసీరా శర్మకి ఉపన్యాసోం మే చిత్రిత్ నారీ కి సమస్యాయే' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో డాక్టర్ కోడి విజయకుమారి మాట్లాడుతూ ఆచార్య సయ్యద్ మెహరూన్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, సహచర అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

వృద్ధురాలికి ఆశ్రమంలో ఆశ్రయం



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలిస్తున్న ట్రస్టు సభ్యులు

గుంటూరు మెడికల్: రోడ్డుపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలిని వదిలేసి వెళ్లిపోయారు. స్థానిక సీతానగర్ మహిళా పోలీస్ గురువారం గుర్తించి గుంటూరు కోవిడ్ ఫైటర్ చారిటబుల్ ట్రస్టు వారికి సమాచారం అందించారు. తక్షణమే సభ్యులు స్పందించారు. అక్కడి చేరుకొని వృద్ధురాలి పరిస్థితిని చూసి ఆశ్రమం వారితో మాట్లాడారు. తర్వాత తమ సొంత వాహనంలో పొన్నూరులోని గోతాలస్వామి ఆశ్రమంలో చేర్పించారు. రోడ్లపై అనాథలుగా ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం అందిస్తే , తక్షణమే వారిని సమీపంలోని ఆశ్రమంలో చేరిస్తామని ట్రస్టు నిర్వాహకులు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. రోగుల్ని ఆసుపత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆసుపత్రికి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్సులో ఉచితంగా తరలిస్తున్నామని పేర్కొన్నారు. ట్రస్టు సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు 81432 22456-9397602553 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

మహారాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం

గుంటూరు ఈస్ట్: పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో గుంటూరు పవర్ ఎంప్లాయీస్ బుధవారం మధ్యాహ్నం మహారాష్ట్ర విద్యుత్ బోర్డు ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించారు.విద్యుత్ శాఖ ఉద్యోగాల సంఘాలు, ఆఫీసర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు విరామ సమయంలో నినాదాలు చేసి సంఘీభావం తెలిపారు. మహారాష్ట్రలో ఆదాని కంపెనీకి ఇస్తున్న డిస్ట్రిబ్యూషన్ లైసెన్సు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు వీరాంజనేయులు, రాష్ట్ర జేఏసీ నాయకులు సుభాని, పవర్ డిప్లొమో నాయకులు సుబ్బారావు, పురుషోత్తం, వరప్రసాద్, సీఐటీయూ నాయకులు నాగబ్రహ్మాచారి, ఎస్సీ, ఎస్టీ యూనియన్ జిల్లా నాయకుడు దాసుబాబు పాల్గొన్నారు.

చెట్టు నరికినందుకు జరిమానా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని అరండల్ పేట 7/4లో 25 నుంచి 30 సంవత్సరాల వయసున్న తురాయి చెట్టును ఇంటి యజమాని బాలరాజు నగరపాలక సంస్థ అనుమతి లేకుండా తొలగించినందుకు వివరణ ఇవ్వాలని హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు నోటీసు జారీ చేశారు. వాల్టా చట్టం కింద చెట్టు తొలగించినందుకు రూ. 10000ను చలానా రూపంలో నగరపాలక సంస్థకు చెల్లించాలని, లేనిపక్షంలో పోలీసు కేసు నమోదు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆశీలు వసూలు లెక్క తేల్చాల్సిందే..

- సండ్రీస్ మార్కెట్ ఆశీలు వసూళ్లలో అవినీతిపై తుది విచారణ
- ఏ ఉద్యోగి వల్ల ఎంత నష్టం వచ్చిందనే అంశంపై పరిశీలన
- కొద్ది రోజుల కిందట జీఓ విడుదల చేసిన ప్రభుత్వం



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: సండ్రీస్ మార్కెట్ వసూళ్లలో సిబ్బంది చేతివాటంపై ప్రభుత్వం తుది విచారణకు ఆదేశించింది. ఏ ఉద్యోగి వల్ల ఎంత నష్టం వచ్చిందో తేల్చాలని ఆదేశిస్తూ నగరపాలక సంస్థ అధికారులకు కొద్ది రోజుల కిందట జీఓ విడుదల చేసింది. 2012–13లో సండ్రీస్ మార్కెట్ ఆశీలు వసూలులో పలు అవకతవకలు వెలుగు చూశాయి. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో 2018లో రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డీఎంఏ) ఎంక్వయిరీ వేసి కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లిందని నివేదికలు ఇచ్చింది. అప్పటి నుంచి దీనికి సంబంధించి ఆర్టికల్ చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ నివేదికలు ఇవ్వాలని పలుమార్లు ప్రభుత్వం అడిగినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు స్పందించ లేదు. ఈ అంశంపై గత సంవత్సరం జూలైలో సాక్షి దినపత్రికలో 'ఆశీలు వసూలులో చేతివాటం...నగరపాలక సంస్థకు నష్టం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వం స్పందించి అవినీతి అధికారులపై రెవెన్యూ రికవరీ(ఆర్.ఆర్ యాక్ట్) కింద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించి తుది విచారణ చేసి రిపోర్టు పంపాల్సిందిగా వెంకట్రామయ్య (ప్రెజెంటింగ్ ఆఫీసర్, రెవెన్యూ సూపరింటెండెంట్), డి. శ్రీనివాసరావు (డెప్యూటీ కమిషనర్)ను ఎంక్వయిరీ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం కొద్ది రోజుల కిందట జీఓ జారీ చేసింది. ప్రస్తుతం డీసీ బదిలీపై సీడీఎంఏ కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం వేరే అధికారిని నియమించే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఇది విషయం....

నగరంలో సండ్రీస్ మార్కెట్‌కు మంచి వాల్యూ ఉంది. కాంట్రాక్టర్లు పాట దక్కించుకోవాలని ఎంతగానో ఆరాట పడుతుంటారు. గత సంవత్సరం పాట సుమారు రూ.2 కోట్లకు పైగా పోయిందంటే దీనికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది. అయితే, 2012–13లో మార్కెట్ నిర్వహణ సంబంధించి వేలం పాట నిర్వహించక పోవడంతో ఆశీలు వసూలు చేసే పనిని నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులే చేపట్టారు. వసూలు చేసిన నగదు నగరపాలక సంస్థకు చెల్లించకపోవడంతో రూ.21,27,777 ఆర్థిక నష్టం వాటిల్లింది.

2016లో ప్రభుత్వానికి ఫిర్యాదు

సండ్రీస్ మార్కెట్ నుంచి వసూలు చేసిన ఆశీలు నగరపాలక సంస్థకు రెవెన్యూ అధికారులు జమ చేయలేదని 2016లో ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. వెంటనే దీనిపై విచారణ చేసి తగిన నివేదిక ఇవ్వాలని మున్సిపల్ ఆర్డీని నియమించింది. 2018లో విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేల్చారు. దీనికి సంబంధించి ముగ్గురు రెవెన్యూ సిబ్బంది హెచ్. వెంకటేశ్వర్లు (అప్పుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), సీహెచ్. హరిబాబు (అప్పుడు ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్), ఎంబీడీ విజయ్‌కుమార్(అప్పుడు ఏ–2 క్లర్క్)లను బాధ్యులను చేస్తూ 2019లో ప్రభుత్వానికి నివేదించింది. అయితే, ఈ అధికారుల్లో హెచ్. వెంకటేశ్వర్లు మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన ఇద్దరు రిటైర్డ్ అయ్యారు. ఈ విచారణకు సంబంధించిన ఫైల్ ప్రభుత్వానికి త్వరితగతిన చేరినట్లయితే హెచ్. వెంకటేశ్వర్లు జీతంలో నుంచి నష్టాన్ని రికవరీ చేసేందుకు అవకాశం ఉంది. మిగిలిన ఇద్దరు రిటైర్డ్ అయ్యారు కాబట్టి వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించనుంది.

నోటీసులు ఇస్తాం

ఆశీలు వసూలులో అవకతవకలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకటేశ్వర్లుకు త్వరలో నోటీసులు ఇచ్చి, విచారణ చేపడతాం. వీలైనంత త్వరలో దాన్ని పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

–డి.శ్రీనివాసరావు, స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఆఫీస్ ఆఫ్ సీడీఎంఏ

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: పాత గుంటూరు పరిధిలోని శివారు ప్రాంతాల్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 3వ డివిజన్ ప్రగతీనగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రగతీనగర్‌లో రోడ్లు, సైడు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తాగునీటికి కూడా పూర్తిస్థాయిలో కుళాయిలు లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా అదనంగా చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రగతీనగర్‌లో గతంలో కన్నా రెండేళ్ల నుంచి కచ్చా రోడ్లు, విద్యుత్ సౌకర్యం, కొన్ని వీధుల్లో కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దశల వారీగా మౌలిక సదుపాయాలు కల్పించి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు పాటుపడతామని హామీ ఇచ్చారు. కాల్వలు, రోడ్లు, తాగునీటి ఇబ్బందులపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారుల్ని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులకు అందుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు మెహమూద్, ఆబీద్, షేక్ మీరావలి, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వరరావు, భాస్కర్, తోట ఆంజనేయులు, స్వర్ణలత, రాంబాబు, లీలాకృష్ణ, అంకమ్మరావు, సాంబశివరావు, బ్రహ్మానాయుడు, మాధవ కృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాపాయం నుంచి రక్షణ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, పక్కన డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, డాక్టర్ మద్ది వినోద్‌కుమార్

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధరించడం వల్ల మెదడు, తలకు గాయాలు కాకుండా, ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చని సూచించారు. కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని అమృత హాస్పిటల్‌లో బుధవారం వైద్య సిబ్బందికి ఆయన ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దక్షిణ భారత దేశంలోనే అత్యధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారేనని తెలిపారు. మార్పు మన వద్ద నుంచే ప్రారంభమవ్వాలనే మంచి ఆలోచనతో ఆస్పత్రి సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

పాత గుంటూరు: సంక్రాంతి పురస్కరించుకుని భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని ఎల్‌వీఆర్ క్లబ్ ప్రాంగణంలో ఈ నెల 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న సాయంత్రం 6 గంటలకు ఆహ్వాన నాటికల్లో బహురూపి, సూత్రం నాటికల ప్రదర్శన, అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త భాష్యం ప్రవీణ్‌కు ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. 15న ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు నటించిన చిత్రాల్లోని మధుర గీతాల సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ సమస్యతో బాధపడుతున్నవారికి గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కేర్‌వెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. స్థానిక గుంటూరువారి తోట 7వ లైన్‌లోని తమ హాస్పిటల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఒక్కో రోగికి రూ. 10 వేల విలువ చేసే ఫైబ్రో స్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించు కోవాలని కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు 8341713713, 9854757999 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

వార్డుల్లో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలోని 57 వార్డులో రూ.150 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందులో డ్రైయిన్లు, రోడ్ల నిర్మాణాలకే రూ.70 కోట్లను కేటాయించామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆమె బుధవారం బ్రాడీపేట 1వ లైన్‌లో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలించారు. కొలతల్ని తనిఖీ చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న పలు రోడ్లతో పాటు మెరుగైన ప్రజారోగ్యం కోసం సీసీ డ్రైయిన్ల నిర్మాణానికి అధిక ప్రాధ్యాన్యత ఇస్తున్నామని చెప్పారు. పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, వేగంగా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు నూటికి నూరు శాతం పాటించేలా ఎమినిటీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో సిటీప్లానర్ మూర్తి, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫీక్, ఏసీపీ బాబూరావు, టీపీఎస్ హృదయరాజు, ఏఈలు సునీల్ కుమార్, అనూష, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కుందుల రోడ్డులోని 117 వార్డు సచివాలయాన్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యదర్శులంతా ఐక్యంగా ఉండి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే సచివాలయాన్ని ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవల్ని సకాలంలో అందించడానికి కూడా సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయంలో తాగునీటి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

విద్యాభివృద్ధికి గోగినేని కనకయ్య సేవలు చిరస్మరణీయం



కనకయ్య విగ్రహం వద్ద విద్యార్థులతో రాయపాటి శ్రీనివాస్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి విద్వాన్ గోగినేని కనకయ్య సేవలు చిరస్మరణీయమని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో బుధవారం కనకయ్య 106వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ కళాశాల ప్రాంగణంలోని కనకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్య అందుబాటులేని రోజుల్లోనే కనకయ్య అనేక పాఠశాలలు, కళాశాలల్ని స్థాపించి విద్యాభివృద్ధికి నడుం బిగించారని తెలిపారు. ఈ సందర్భంగా సంగీత, నృత్యం, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గద్దె మంగయ్య, కోశాధికారి వేమన కుప్పుస్వామి, కమిటీ ప్రత్యేక అతిథులు రాయపాటి మోహన్ సాయికృష్ణ, ప్రిన్సిపాల్ మోటూరి రవికుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి హిందూ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌ఐవో సునీత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక హిందూ కళాశాలలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పోలో నగరంలోని హైస్కూళ్లతో పాటు, జూనియర్ కళాశాలలు భాగస్వాములు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ కోరారు. సాంబశివపేటలోని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ఆర్ఐవో జి. సునీత సైన్స్ ఎక్స్‌పో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ హిందూ కళాశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనలో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రాజెక్టులను సైతం ప్రదర్శించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యాసంస్థల యాజమాన్యాలు హిందూ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఆర్ఐవో సునీత మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడంలో ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి పీవీ రాము, కన్వీనర్ డాక్టర్ ఎం .మాధవి పాల్గొన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాపాడాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నెహ్రూనగర్: రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ నటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం దళిత బహుజన మేధావి బైరి నరేష్‌కు మద్దతుగా దళిత, బహుజన పాత్రికేయ హేతువాద సంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ అయ్యప్ప జన్మ వృత్తాంతాన్ని దళిత బహుజన మేధావి, హేతువాది బైరి నరేష్ వివరించినందుకు కొంతమంది హిందూ మతోన్మాదులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడి చేయడం దారుణమని తెలిపారు. అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయించడాన్ని ఖండించారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. తక్షణం బైరి నరేష్‌పై అక్రమ కేసును ఉపసంహరించుకొని, ఆయనపై దాడి చేసిన వారిని తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బి.విజయభాస్కరరావు, సీనియర్ జర్నలిస్టు మామిడి ప్రకాష్, అంబేడ్కర్ యూత్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల కోటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయ కుడు గనిరాజు, బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జి భగత్ సింగ్, ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక నాయకులు తిప్పా బత్తుల గోవిందు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే ముస్తఫా



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్ ధనలక్ష్మి తదితరులు

పట్నంబజారు: పింఛన్‌దారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. నియోజకవర్గంలోని 8వ డివిజన్ పరిధిలోని పింఛన్‌దారులకు బుధవారం పాత గుంటూరులోని కాపు భవన్‌లో వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా రూ. 2750 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పింఛన్‌దారుల్ని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పింఛన్లను దఫాల వారీగా పెంచుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి, మహిళా నేత నూరి ఫాతిమా, శివాలయం చైర్మన్ మాధవ, మిర్చి యార్డు డైరెక్టర్ కోటేశ్వరరావు, డివిజన్ కన్వీనర్ పుల్లా కిశోర్, వైఎస్సార్ సీపీ నేతలు యిర్రి సాయి, తోట ఆంజనేయులు, సుభాని, జఫ్రుల్లా, భాను, వెంకటేశ్వరమ్మ, మానస, గౌరి, జ్యోతి పాల్గొన్నారు.

నూతన పెన్షన్‌తో వృద్ధుని జీవనానికి భరోసా



పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ



వృద్ధుడికి కొత్త పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ

నగరంపాలెం: అనాథైన ఓ వృద్ధుడికి కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు నిమ్మల వెంకటరమణ పెన్షన్ మంజూరు చేయించి, జీవనానికి భరోసా కల్పించారు. 18వ డివిజన్‌లోని పట్నంబజార్‌లో రోడ్డు వెంట గంగిరెడ్డి శివ ఉండేవాడు. వృద్ధాప్యంలో ఉన్న అతనికి నా అనే వారు ఎవరూ లేరు. కూలీ పనులకు వెళ్తూ జీవించేవాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం రూపంలో విధి వెక్కిరించింది. కుడి కాలికి గాయాలై, నడవలేని దుస్థితి. దీంతో రోజు వారీ పనులు చేసుకునేందుకు నానా అగచాట్లు పడేవాడు. వృద్ధుడి బాధను స్థానికులు 18వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు నిమ్మల వెంకటరమణ దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించారు. దీంతో పింఛన్ కోసం దరఖాస్తు చేయగా, మంజూరైంది. కొత్తగా మంజూరైన రూ.2,750 పింఛన్‌ను బుధవారం కార్పొరేటర్ గంగిరెడ్డి శివకు అందించారు. దీంతో శివ ముఖంలో చిరునవ్వు కనిపించింది. పోషణకు, మందుల కొనుగోలుకు సాయమందించిన సీఎం వై.ఎస్.జగన్‌కు, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

కొత్తగా 56 మందికి పింఛన్ల మంజూరు

నెహ్రూనగర్: 56 డివిజన్‌లోని 161, 162, 163, 164 సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను 56 మందికి బుధవారం డివిజన్ కార్పొరేటర్ కనకదుర్గ అందజేశారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంపు చేయడం అభినందనీయమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



విద్యార్థికి ట్యాబ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: విద్యా విధానానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి, సమూల మార్పులతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రను సృష్టించారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. ఆమె బుధవారం 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విద్యా విధానంలో చేపడుతున్న విప్లవాత్మకమైన మార్పులతో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికీ ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు జగనన్న ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. బైజూస్ టెక్నాలజీని ఉచితంగా పేద విద్యార్థులకు అందజేసిన జగనన్నకు అందరు అండగా నిలవాలని సుచరిత కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, పత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ ముత్యాల నాగరాజు, వెంకట్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో బాలుడి మృతి

గుంటూరు ఈస్ట్: అనుమానాస్పదస్థితిలో బాలుడి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు రూరల్ మండలం గ్రామికనగర్ 6వ లైనులో నివసించే శివప్రసాద్, స్వాతి దంపతుల రెండో కుమారుడు ఎనిమిది సంవత్సరాల సుశాంత్ మంగళవారం జ్వరంతో అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు అతనిని చుట్టుగుంట సెంటర్‌లోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అతడు ఇంజక్షన్ చేసి, బిళ్లలు ఇచ్చాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు బాలుడ్ని ఇంటికి తీసుకెళ్లారు. కొంతసేపటికి అస్వస్థతకు గురవ్వగా, తల్లిదండ్రులు జీజీహెచ్‌లోని పిల్లల వార్డుకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతికి గల కారణాలు దర్యాప్తు అనంతరం తెలుస్తాయని తెలిపారు.

శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేద మంత్రోచ్చారణతో కలెక్టర్‌కు స్వామి దర్శనం కల్పించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.